
'ఇంటింటా ఇన్నోవేటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఆగస్టు 7: స్థానిక సమస్యలు పరిష్కరించే విధంగా వినూత్న ఆవిష్కరణలకు 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమం అవకాశం కల్పిస్తోందని, ఈ వినూత్న ఆవిష్కరణలతో దరఖాస్తు చేసుకునేందుకు 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు వినూత్న ఆవిష్కరణలతో ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

సుద్ద కంపెనీకి భారీ ఫైన్

సుద్ద నిల్వలకు సరైన ఆధారాలు చూపనందుకు, అక్రమంగా నిల్వ చేసినట్లుగా భావించి సదరు కంపెనీ యజమాన్యానికి మైనింగ్ అధికారులు భారీగా జరిమానా విధించారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. ఇప్పటివరకు ఏ కంపెనీకి విధించని విధంగా 68,22,270 రూపాయల పెనాల్టీ వేశారు. దీనిపై ఆ కంపెనీ యజమాని స్పందించకపోవడంతో అధికారులు మరోసారి నోటీసులు పంపించారు. గడువు దాటుతున్నా దీనికీ స్పందించకపోవడంతో రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్టు ద్వారా ఫైన్ సొమ్మును వసూలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా, ఈ సుద్ద తవ్వకాలు ఎక్కడ చేపట్టారో లోతైన విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- మూడు రోజుల క్రితం మరోసారి నోటీసులు
- మంగళవారంతో దానికీ ముగిసిన గడువు
- ఆర్ఆర్‌యాక్ట్ ద్వారా వసూలుకు మైనింగ్ అధికారుల చర్యలు
- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలకు స్పందన


అక్రమంగా నిల్వ ఉంచిన సుద్ద (ఫైల్)


సుద్దపై గద్దల్లా..!

ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథనం

రూ.68.22 లక్షల జరిమానా » మొదటి నోటీసుకు స్పందించని యాజమాన్యం

తాండూరు, ఆగస్టు 7: సుద్ద అక్రమ నిల్వలపై మైనింగ్ అధికారులు సీరియస్‌గా స్పందించారు. జూన్ 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సుద్దపై గద్దల్లా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సదరు కంపెనీకి రూ.68.22 లక్షల భారీ జరిమానాను విధించారు. ఈ మేరకు మైనింగ్ రూల్స్‌ను పొందుపరుస్తూ పెనాల్టీని చెల్లించాలని మైన్స్ శాఖ అధికారులు జూన్20న ఎంఎస్ కోఫియా క్లే లిమిటెడ్ యజమాని అల్బర్ట్ చాకోకు స్పష్టంగా డిమాండ్ నోటీసులు పంపించారు. ఈ నోటీసుకు స్పందించకపోవడంతో మూడ్రోజుల క్రితం మరోసారి నోటీసులు జారీ చేశారు. దాని గడువు కూడా మంగళవారంతో ముగియడంతో రెవెన్యూ ఆర్ ఆర్ యాక్ట్ ద్వారా వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.

వివరాల్లోకి వెళ్తే.. పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ శివారులోని సర్వే నం.11/ఆ/1లో టన్నుల కొద్ది సుద్దను డంపింగ్ చేశారు. పత్రికలో ప్రచురితమైన కథనంతో అదే రోజు మైన్స్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి సుద్ద అక్రమ నిల్వలను సీజ్ చేసి, యజమాని నుంచి లిఖితపూర్వక సమాధానం కోరాలని నిర్ణయించారు. జూన్ 15న 'అక్రమ సుద్దపై చర్యలేవి' అనే శీర్షికన మరో కథనాన్ని ప్రచురించారు. విచారణతో సరి పెట్టారని ఈ కథనంలో పేర్కొనడడంతో లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆ భూమి పట్టాదారుడు అల్బర్ట్ చాకోకు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపించారు. మారేపల్లిలోని సర్వే నం. 11/ఆ/1 యందు డంప్ చేసిన 4,900 మెట్రిక్ టన్నుల ఫుల్లర్స్ ఎర్త్ మినరల్ పరిమాణానికి సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించాలని కోరారు. జూన్ 28న నోటీసును అందుకున్న చాకో ఇచ్చిన సమాధానానికి అధికారులు సంతృప్తి చెందకపోవడంతో పెనాల్టీ విధించాలంటూ నిర్ణయించారు.

ఐదు రెట్లు అధికంగా పెనాల్టీ

రూల్ 26 ప్రకారం ఇది ఉల్లంఘనేనని, మైన్స్ రూల్ (33)ఆధారంగా ఐదు రెట్లు పెనాల్టీ , ఇతర చట్టబద్ధమైన మొత్తాలతో పాటు సాధారణ సీనారేజీ రుసుం విధిస్తూ మొత్తం రూ.68, 22, 270 లను చలాన్ ద్వారా మైన్స్ శాఖకు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఇందులో సీనరేజ్ ఫీజు కింద రూ. రూ.9,55,500, ఐదు రెట్లు పెనాల్టీ కింద రూ.47,77, 500, డీఎంఎఫ్(టి) కింద రూ.2,86,650, పర్మిట్ ఫీజు కింద రూ. 7,64,400, ఎస్ఎంఈటీ కింద రూ. 19,110, ఐటీ కింద రూ.19,110 చెల్లించాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. ఎంఎస్ కోఫియా క్లే లిమిటెడ్ యజమాని అల్బర్ట్ చాకోకు ఈ నోటీసు ముట్టిన 15 రోజుల్లో చెల్లించాలని లేని పక్షంలో మినరల్ రెవెన్యూ బకాయిల కింద ఆర్ ఆర్ యాక్ట్ ద్వారా రికవరి చేయాల్సి ఉంటుందని పేర్కొంటూ తాండూరు మైన్స్ అండ్ జియాలజి అసిస్టెంట్ డైరెక్టర్ డిమాండ్ నోటీసును జారీ చేశారు.

లోతైన విచారణ చేయాలని డిమాండ్

మైన్స్ రెవెన్యూ శాఖ అధికారులు మరింతగా లోతుగా విచారణ జరిపితే అక్రమాలు మరిన్ని వెలుగులో రానున్నాయి. ఇంతకు సుద్దను ఎక్కడ తవ్వకాలు జరిపారు. సీజ్ చేసిన సుద్దకు సంబంధించిన తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఉన్నట్లయితే ఎన్ని టన్నులకు ఉంది. వంటి అంశాలపై విచారణ చేపడితే పెద్ద ఎత్తున సుద్ద అక్రమాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. పెద్ద మొత్తంలో పెనాల్టీ సుద్ద వ్యాపారులలో చర్చనీయమైంది. ఎంఎస్‌కోఫియా క్లే లిమిటెడ్ యజమాని అల్బర్ట్ చాకోకు రెండోసారి జారీ చేసిన నోటీసు గడువు కూడా మంగళవారంతో ముగిసింది. ఈ విషయంలో అధికారులు రికవరీ చేస్తారా? లేదా? అనే అంశం చర్చనీయాంశమైంది. ఇంత భారీ పెనాల్టీ విధించడం ఇది మొదటి సారి అని స్థానికులు చర్చించుకుంటున్నారు.


వికారాబాద్‌లో పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- అధిక సంఖ్యలో మొక్కలు నాటాలి
- అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు

వికారాబాద్, ఆగస్టు 7: వికారాబాద్ పట్టణంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మునిసిపల్ పరిధిలో 14, 23వ వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు పార్కులను ఆయన పరిశీలించారు. పార్కులను అభివృద్ధి పరచడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్ జాకీర్ అహమ్మద్‌ను ఆదేశించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో వార్డుల వారీగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. 9న పార్కుల్లో అధిక సంఖ్యలో మొక్కలు నాటే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం 24వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మేకలగండిలోని డంపింగ్ యార్డును పరిశీలించి ఇళ్లలో నుంచి సేకరించే తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్, కౌన్సిలర్లు ప్రభావతి, రామస్వామి పాల్గొన్నారు.

హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉండాలి

దోమ, ఆగస్టు 7: మున్సిపల్ పరిధిలోని పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పరిగి మున్సిపాలిటీలో కలెక్టర్ పర్యటించారు. మున్సిపల్ పార్కులను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం సాంఘిక సంక్షేమ గుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల అవసరాలు, భోజనం తదితర వాటిపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదులకు తగిన మరమ్మతులు చేపట్టాలని, వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సన్నద్ధం కండి

- అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 7: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతం చేసే విధంగా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణమంతా శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, మహాలక్ష్మి, వంటగ్యాస్, రైతు రుణమాఫీ పథకాలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, డీఆర్‌డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అక్రమంగా వేసిన సీసీ రోడ్డు ధ్వంసం

ఆంధ్రజ్యోతి కథనానికి అధికారుల స్పందన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 7 : మేడ్చల్ - కిష్టాపూర్ రోడ్డులో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వెంచర్ కోసం రియల్టర్లు వేసిన సీసీ రోడ్డును రెవెన్యూ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన 'సర్కారు భూమిలో ప్రైవేటు రోడ్డు' అనే కథనానికి అధికారులు స్పందించారు. పోలీసు బందోబస్తు నడుమ ఉదయం వేళ ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీ రోడ్డును జేసీబీ సహాయంతో తొలగించారు. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాల పక్కనున్న భూములు కొని వాటిలో వెంచర్లు వేసి అవసరం మేరకు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇష్టారీతిన వ్యాపారం సాగిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

వానాకాలం ధాన్యం సేకరణపై ప్రత్యేక కార్యాచరణ

- వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్

వికారాబాద్, ఆగస్టు 7 : వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణ, గత వానాకాలం సీజన్, యాసంగి సంబంధించి సీఎంఆర్ అప్పగింతపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణ, సీఎంఆర్, ధాన్యం వేలం తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, సివిల్ సప్లయాస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, జాయింట్ సెక్రటరీ ప్రియాంక జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీసీఎస్‌వో రాజేశ్వర్, డీఎస్‌వో తదితరులు హాజరయ్యారు. ఈ సీజన్‌లో ధాన్యం సేకరణపై పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సీఎంఆర్, ఎగవేతదారులుగా గుర్తించిన రైస్ మిల్లుల నుంచి రావాల్సిన సీఎంఆర్ బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. రేషన్ బియ్యం దారి మళ్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశించచారు. ఆ మేరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని జిల్లా అధికారులు తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా అధికారులు



ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమల్, కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్లు పోషక ఆహార పదార్థాలతో తయారు చేసిన బొమ్మలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అలాగే ఐసీడీఎస్ లోగోను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. -తాండూరు, ఆగస్టు 7

జ్యువెలరీ షాప్‌లో భారీ చోరీ

- 480గ్రా. బంగారు, 80కిలోల వెండి నగలు రూ.లక్షన్నర నగదు అపహరణ
- మేడ్చల్ జిల్లా తూంకుంటలో ఘటన

మూడుచింతలపల్లి, ఆగస్టు 7: ఓ జ్యువెలరీ షాపులో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనలో 480గ్రా. బంగారం, 80కిలోల వెండి ఆభరణాలు, రూ.లక్షన్నర నగదును దొంగిలించారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంటకు చెందిన గణేశ్ తూంకుంటలో 'కృష్ణ జ్యువెలరీ' షాప్‌ను నడిపిస్తున్నాడు. మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా షెటర్ విరగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు షటర్‌ను రాడ్డుతో పైకి లేపి దొంగలు లోపలికి చొరబడినట్లు గుర్తించారు. దుకాణంలో 48తులాల బంగారు నగలు, 80కిలోల వెండి ఆభరణాలు, రూ.లక్షన్నర నగదు, సీసీ కెమెరాల ఫుటేజీని ఎత్తుకుపోయినట్లు గణేశ్ ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సంఘటనా స్థలాన్ని బాల్‌నగర్ డీసీపీ సురేశ్‌కుమార్, మేడ్చల్ డీసీపీ నర్సింహారెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.



జ్యువెలరీ షాప్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

రేషన్ బియ్యం బస్తాల్లో తరుగు

- లబోదిబోమంటున్న డీలర్లు
- సివిల్‌సప్లై డీఎంకు ఫిర్యాదు
- ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్దే లోపం




50 కిలోల సంచి తూకం వేయగా చూపిస్తున్న 46.730 కిలోలు

మేడ్చల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆహార భద్రతా కార్డుదారులకు నెలనెలా పంపిణీ చేసే రేషన్ బియ్యం తూకంలో తేడాలున్నాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి బస్తా సంచులు రేషన్ దుకాణాలకు వస్తాయి. కొన్నింటిలో కిలోల కొద్ది తక్కువగా వస్తుండటంతో డీలర్లు లబోదిబోమంటున్నారు. మేడ్చల్ డివిజన్‌లో ఓ ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి వచ్చే సంచుల్లో పెద్ద మొత్తంలో తరుగు ఉంటుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్లకు దూరంగా ఉండే దుకాణాలకు వెళ్లే బియ్యం సంచుల్లోనూ తక్కువ తూకం వస్తున్నట్లు వాపోతున్నారు.

రంగుమారి ముక్క వాసన


జిల్లాలో 619 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటికి 6 ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి ప్రతి నెలా కోటా సరఫరా చేస్తారు. గన్నీ సంచి బరువు 500 గ్రాములు, బియ్యం బరువు 49.500 గ్రాములు కలిపి మొత్తం 50 కిలోల తూకం వేసి దుకాణాలకు పంపిస్తారు. కొన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి వచ్చే సంచులు 47, 48 కిలోలే ఉంటున్నాయి. మరికొన్ని దుకాణాలకు ఇంకా తక్కువగా వస్తున్నట్లు డీలర్లు పేర్కొంటున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఒకేసారి క్వింటాళ్ల చొప్పున తూకం వేయడంతో సంచుల్లో తూకంలో తేడా వస్తున్న విషయం తెలియడం లేదు. ప్రతీనెల కొన్ని రేషన్ దుకాణాల్లో ఈ సమస్య తలెత్తుతోందని డీలర్లు వాపోతున్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా సరఫరా అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సరఫరా చేసే బియ్యం ముక్క వాసన వస్తున్నట్లు డీలర్లు పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో ముక్కిపోయి బియ్యం రంగు కూడా మారుతుందనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



లబ్ధిదారులకు అందాల్సిన బియ్యం సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ లబ్ధిదారుడికి బియ్యం చేరాల్సిందే. డీలర్లు ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద దగ్గరుండి తూకం సరి చూసుకున్న తర్వాతనే వేలిముద్ర వేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. బియ్యం సంచుల్లో తూకం తక్కువగా ఉంటున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-రాజేందర్, పౌర సరఫరాల సంస్థ, జిల్లా మేనేజర్



ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ అధికారుల బదిలీలు

యాచారం, ఆగస్టు 7: మండలానికి చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ అధికారులు బదిలీ అయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత ఇబ్రహీంపట్నంకు బదిలీ కాగా, మిషన్ భగీరథ ఏఈ అనిరుధ్ ఈఎన్‌సీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుభాష్ దేవరకొండ నుంచి బదిలీపై వచ్చారు.

మిషన్ భగీరథ ఏఈగా ప్రణయ్ కల్వకుర్తి నుంచి బదిలీపై వచ్చారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

స్థానికతపై జీవో 33 సమగ్రంగా లేదు


- కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ బిడ్డలకు నష్టం
- కేంద్రం గ్రామాలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించారు: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు తెలంగాణ బిడ్డలకు నష్టం కలిగిస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలో జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని, తెలంగాణ బిడ్డలే నాన్ లోకల్ అవుతున్నారన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరిస్తోందన్నారు. 2024 జూన్ 2 నాటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తికావడంతో స్థానికత నిర్ధారణకు సొంత నిబంధనలు రూపొందించుకోవడానికి రాష్ట్రానికి అవకాశం దక్కిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిడ్డలకు విద్యా సంస్థల్లో ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఆలోచన చేసి, నిబంధనలు తయారు చేయాల్సి ఉండగా.. అలాంటిదేం లేకుండా ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం 33 జీవో తెచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంశంలోనూ సరిగా అవగాహన లేదని, అందుకే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే దాన్నే స్థానికతగా నిర్ణయిస్తూ జీవో తెచ్చిందన్నారు. దీని వల్ల తెలంగాణ బిడ్డలు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో 95 శాతం స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా విధానాలు తెచ్చారని, అదే పద్ధతి విద్య విషయంలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వచ్చాక ఏర్పాటుచేసిన వైద్య కళాశాలల్లో స్థానికేతర విద్యార్థులకు రిజర్వేషన్ అమలు చేయలేదని, స్థానికులకే సీట్లు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస నిధులైనా ఇవ్వకపోతే పంచాయతీలు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఎలా నిర్వహిస్తాయని ప్రశ్నించారు. ఉపాధి హామీ, ఆరోగ్య మిషన్ వంటి పథకాల కింద కేంద్రం ఇచ్చిన రూ.2100 కోట్లను గ్రామాలకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నుంచి రావాల్సిన మరిన్ని నిధులకు బ్రేక్ పడిందన్నారు. కాంగ్రెస్ పాలన చేపట్టిన 8 నెలల్లో పంచాయతీలకు పైసా కూడా ఇవ్వలేదన్నారు.

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో 235 వైద్య పోస్టుల భర్తీ

- రేపు వాకిన్ ఇంటర్వ్యూల నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్నా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపాదికన భర్తీ చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 235 మంది వైద్యుల పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ప్రొఫెసర్ పోస్టులు-8, అసోసియేట్ ప్రొఫెసర్-23, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-111, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-33 ఉన్నాయి. గాంధీలో ప్రొఫెసర్ పోస్టులు-3, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-29, సీనియర్ రెసిడెంట్స్-24, ట్యూటర్లు-4 పోస్టులున్నాయి. ఈ పోస్టులను వాకిన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈమేరకు 9న ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. 12న ధ్రువపత్రాల పరిశీలన, 13న అభ్యంతరాల స్వీకరణ, 14న ఎంపిక ప్రక్రియ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలను గాంధీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నియామకాలు పారదర్శకంగా జరిగేలా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, టీవీవీపీ కమిషనర్‌లను నోడల్ అధికారులుగా నియమిస్తూ సర్కారు జీవో జారీ చేసింది.



ఆ ఆస్పత్రుల్లో వైద్యులు పెరిగారు

కాగా వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీలతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత నెలకొందన్న వార్తల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ దానిపై స్పష్టతనిచ్చింది. దీర్ఘకాలం ఒకే చోట ఉన్న వారిలో 40 శాతం మందిని బదిలీ చేయాలని జీవో 80 చెబుతోందని, ఆ మేరకే బదిలీలు చేపట్టామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. బదిలీలతో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ప్రభావం లేదని, ఆ రెండింట్లో గతం కంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారన్నారు. ఉస్మానియాలో గతేడాది 169 మంది డాక్టర్లు, 247 మంది నర్సులుంటే... ప్రస్తుతం 266 మంది వైద్యులు, 263 నర్సులున్నారని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక గాంధీలో ఇంతకు ముందు 295 మంది డాక్టర్లు, 191 మంది నర్సులుండగా..ప్రస్తుతం 362 మంది వైద్యులు, 287 మంది నర్సులున్నారని వెల్లడించింది.

భూముల సర్వేకు డ్రోన్లు

ప్రత్యేయ యాప్‌తో అనుసంధానం.. జియో ట్యాగింగ్‌తో ఫొటోలు

- గంటలో 100 ఎకరాల దాకా కొలతలు
- ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల రూపకల్పన
- దేశంలో తొలి సర్వే డ్రోన్‌గా గుర్తించిన కేంద్ర సర్కారు

కంది, ఆగస్టు 7: భూములను గొలుసులతో కొలవడం సంప్రదాయ పద్ధతి! దీనికి మనుషులు ఎక్కువే అవసరం. సమయమూ బాగానే పడుతుంది. ఎకరం-రెండకాలను కొలిచేందుకు గంటకు పైగా పడుతుంది. డిజిటల్ యంత్రాలు వచ్చేశాయ్.. కాబట్టి మనుషులు తక్కువ అవసరం.. సమయమూ కొంత తగ్గింది! మరి.. ఒకే ఒక గంటలో 100 ఎకరాల భూమిని సర్వే చేయగలిగేలా వ్యవస్థ ఏదైనా అందుబాటులోకొస్తే? అద్భుతమే కదా! ఆ వ్యవస్థ వచ్చేసింది. అదే.. డ్రోన్లద్వారా భూ సర్వే పద్ధతి! సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పరిశోధకులు భూములను సర్వే చేసేందుకు ప్రత్యేక డ్రోన్లను రూపొందించారు. ఈ డ్రోన్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టడానికి ఐఐటీ-హెచ్‌లోని ఇంక్యూబేషన్ విభాగం అధికారులు క్రిస్టల్‌బాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించారు. ఈ డ్రోన్‌లను డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అంగీకరించింది. భూముల సర్వేలో దీని పనితీరు పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఈ డ్రోన్లను సర్వే డ్రోన్లుగా గుర్తించింది. ఫలితంగా దేశంలోనే తొలి సర్వే డ్రోన్‌గా గుర్తింపు పొందింది. మోడల్-వీ పేరుతో తయారుచేసిన ఈ డ్రోన్లు సెకండ్‌కు 8 మీటర్లు ఎత్తుకు ఎగురుతాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నిమిషాల పాటు గాలిలోనే ఎగరగల సామర్థ్యంతో వీటిని తయారు చేశారు. భూ సర్వేపై రూపొందించిన ఓ ప్రత్యేక యాప్‌ను అనుసంధానం చేస్తే గాల్లోకి ఎగిరి జియో టాగింగ్‌తో ఫొటోలు తీసి సర్వే హద్దుల వివరాలను పక్కాగా వెల్లడిస్తుంది.


గాల్లో ఎగురుతూ ఫొటోలు తీస్తున్న డ్రోన్

ఈ డ్రోన్ల తయారీ కోసం 32మంది ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్యోగులుగా నియమించుకున్నారు. ఈ డ్రోన్లతో భూ సర్వేలు అత్యంత వేగంగా చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. వీటితో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాలుగా పాఠ్యాంశాలు కూడా బోధించవచ్చునని తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం రెండు నెలల క్రితం ఇదే స్టార్టప్ కంపెనీ ద్వారా 100 డ్రోన్లను కొనుగోలు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఈ సర్వే డ్రోన్లు 300 వరకు అమ్ముడయ్యాయని తెలిసింది. అతి త్వరలోనే గాల్లో గంటసేపు ఎగిరే సామర్థ్యంతో పంట పొలాల్లో మందులు పిచికారి చేసే డ్రోన్లు, సర్వేలెన్స్ డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయని పరిశోధకులు వెల్లడించారు. మంగళవారం సంగారెడ్డి పరిధిలోని కందిలో ఈ డ్రోన్లను ఐఐటీ-హెచ్ స్టార్టప్ కంపెనీ ఉద్యోగులు గాల్లోకి ఎగరవేసి వాటి పనితీరును పరీక్షించారు.

డ్రోన్లతో సర్వే ఇలా..

భూ సర్వే కోసం తొలుత ఈ డ్రోన్‌లకు మొబైల్ ఫోన్‌లో 'మిషన్ ప్లానర్' లేదా 'ల్యాండ్ మెజర్‌మెంట్' యాప్‌లను అనుసంధానం చేయాలి. తర్వాత స్థలం యజమాని చూపించే భూమి హద్దులను బట్టి ఆ యాప్ ద్వారా ఒక బెంచ్ మార్కును గీస్తారు. ఆ యాప్‌లోని కేఎంఎల్ (కీహోల్ మార్కప్ లాంగ్వేజ్) ద్వారా హద్దులను గుర్తించి సర్వే చేయాలనుకున్న ప్రదేశాన్ని మొత్తం చతురస్రాకారంలో ఒక రూట్ మ్యాప్ తయారు చేస్తారు. ఆ మ్యాప్‌తో డ్రోన్‌ని గాల్లోకి వదులుతారు. కేఎంఎల్ ఆధారంగా ఆ డ్రోన్ తీసే ఫొటోలకు మిషన్ ప్లానర్ యాప్‌లో గూగుల్‌లోని సర్వే ప్రదేశం ఉన్న విలేజ్ మ్యాప్‌ను అనుసంధానం చేసి రిపోర్ట్ ఇస్తారు. ఈ సాంకేతికతతో గంటకు 100 ఎకరాలు సర్వే చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. ఈ డ్రోన్లతో భూముల సర్వేతో పాటు కొండలు, గుట్టలు, బురద ప్రాంతాలు, నీటి కుంటలు లాంటి ప్రదేశాల్లో సులువుగా కొలతలు తీయొచ్చు. డ్రోన్ కెమెరాల్లో వాడే కెమెరా మ్యాడ్యూల్‌ను బట్టి మైనింగ్‌లలో, పవర్ ప్లాంట్లు, రైల్వే ట్రాక్ కూడా సర్వే చేయొచ్చునని వారు తెలిపారు.

గత సర్కారు నిర్వాకంతో

పంచాయతీలకు ఇక్కట్లు

- మీ హయాంలో సర్పంచుల ఆత్మహత్యలు చేసుకున్నారు..
- హరీశ్ మర్చిపోయారా?: మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంవల్లే గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే హక్కు వారికి లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో కనీసం పాల్గొనకుండా రాజకీయాలు చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. 'పదే పదే అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరు. మీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న విషయం మర్చిపోయారా?' అని నిలదీశారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ఖండించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.10,170 కోట్లు కేటాయించి రూ.5,988కోట్లే విడుదల చేసిందన్నారు. పంచాయతీలకు 44శాతం నిధులివ్వకుండా గత ప్రభుత్వం సొంత అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. నేషనల్ రూర్బన్ (రూరల్ అర్బన్) మిషన్‌కు 2019 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయేనాటికి రూ.1,200 కోట్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేయించిన పనులకు సంబంధించి ఆరేళ్లుగా రూ.940 కోట్లు, రూరల్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.600కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నూతన పంచాయతీ చట్టం ద్వారా అడ్వర్‌టైజింగ్, మైనింగ్ వంటి పన్నులను పంచాయతీలకు రాకుండా చేసిందని, పంచాయతీలను ఆదుకోకపోగా ఆర్థికంగా మరింత దెబ్బతీశారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంచాయతీలకు నిధులు కేటాయించలేదన్నారు. కేసీఆర్ జన్మదినం కోసం ఫిబ్రవరిలో మొక్కలు నాటించారని విమర్శించారు. కాగా మూడు రోజుల్లోనే 25 లక్షల మొక్కలు నాటించామని, 29 వేల కిలోమీటర్ల రహదారులు, 18 వేల కిలోమీటర్లకుపైగా డ్రైనేజీ కాలువలను శుభ్రపరిచామని, ఇది బీఆర్ఎస్ నేతలకు కనబడటంలేదని సీతక్క పేర్కొన్నారు.

పోలీస్ శాఖలో పనిచేయడం వరం


సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు

వికారాబాద్, ఆగస్టు 7: పోలీస్ శాఖలో పనిచేయడం దేవుడిచ్చిన వరమని డీటీసీ జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం డీటీసీ ప్రిన్సిపాల్ పవీ.మురళీధర్ ఆధ్వర్యంలో డీటీసీలో శిక్షణ పొందుతున్న వారికి సూచనలు చేశారు. శిక్షణానంతరం కొందరు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లోనూ పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ విభాగాల్లోనూ బాగా పనిచేసి పోలీసు శాఖకు పేరు తేవాలన్నారు. ఈ విభాగంలో పనిచేసేందుకు ఇష్టం ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గురువారం వారికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆక్టోపస్ విభాగం ఆర్ఎస్ఐ మహేష్, ప్రిన్సిపాల్ మురళీధర్ పాల్గొన్నారు.

పీడీఎస్ వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ దాడులు


పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వికారాబాద్, ఆగస్టు 7: పీడీఎస్ బియ్యాన్ని కొని వ్యాపారం చేస్తున్న వారిపై బుధవారం దాడులు చేసి 6 కేసులు నమోదు చేశామని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి వెంకటేశం తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని ఎవరూ అక్రమంగా తరలించొద్దన్నారు. కొడంగల్, యాలాల్ మండలాల్లో దాడులు చేశామన్నారు. కొడంగల్ పరిధిలో ఐదుగురు వ్యాపారులను, యాలాల్ పరిధిలో ఒకరి అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి మొత్తం 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధుసూదన్‌రెడ్డి

పూడూరు/బొంరాస్‌పేట్, ఆగస్టు7: మండల పరిధి మోడల్ స్కూల్ విద్యార్థులకు చెన్‌గోముల్ పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం విద్యార్థులకు డయల్ 100, బాల్య వివాహాల నివారణ, రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు తదితరాలపై ఎస్సై మధుసూదన్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుళ్లు నిరంజన్, శివకుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన ఉండాలని బొంరాస్‌పేట్ ఎస్సై అబ్దుల్ రవూఫ్ అన్నారు. నాగిరెడ్డిపల్లిలో గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులు కీడల్లోనూ రాణించాలి


నాగేంద్రను సన్మానిస్తున్న ఎంపీడీవో గాలి యాదయ్య, ఉపాధ్యాయులు

బషీరాబాద్/తాండూరు రూ రల్, ఆగస్టు 7: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని రంజీ క్రికెటర్ నాగేంద్ర అన్నారు. బుధవారం బషీరాబాద్ మండలానికి వచ్చిన ఆయన ఎం పీడీవో గాలి యాదయ్యతో కలిసి బాలు రు ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో సమావేశమయ్యారు.తన బాల్యం, చదువుతో పాటు క్రికెట్‌లో ఎలా రాణించానో విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రికెటర్‌ను ఎంపీడీవో యాదయ్య సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయకార్, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు. అలాగే తాండూరు మండలం అంతారం తండా భూకైలాస్ ఆలయాన్ని క్రికెటర్ నాగేందర్ సందర్శించారు. ఆలయంలో మహాశివుడికి పూజలు చేశారు. తాండూరుకు 5కిలోమీటర్ల దూరంలో ఉన్న భూకైలాశ్ ఆలయం వద్ద అహ్లాదకర వాతావరణం ఉందన్నారు. తర్వాత పాఠశాలను సందర్శించి, ఆయనతో రవిశంకర్, టీచర్లు, పంచాయతీ కార్యదర్శి అంబిక ఉన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన రామన్నగూడ మాజీ సర్పంచ్

చేవెళ్ల, ఆగస్టు 7 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడ గ్రామం మాజీ సర్పంచ్ ఎస్.లావణ్య శంకర్‌తోపాటు మరో 50 మంది నాయకులు బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ నాయకులు సున్నపు వసంతం, ఎం.కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు బండారు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, ప్రభాకర్, శ్రీశైలం, విఠలయ్య, రాంరెడ్డి, నర్సింలు, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వాజిత్, తాజ్, రషిత్, మల్లేష్, రవి, మధుసూదన్‌రెడ్డి, షబ్బీర్, మహేందర్, అనిల్, చింటు, రోహిత్, నాగరాజు, రవి, బాలయ్య, ఉస్మాన్, శివ, తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ లావణ్యశంకర్

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

షాబాద్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని కుర్వగూడ గ్రామానికి చెందిన శివశంకర్‌యాదవ్‌కు రూ.32 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును వారు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచారన్నారు. మాజీ సర్పంచ్ చందిప్ప జంగయ్య, గ్రామస్థులు భాస్కర్‌గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే మానవ అక్రమ రవాణా కట్టడి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 7: ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే మానవ అక్రమ రవాణా అరికట్టబడుతుందని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా స్థానిక మున్సిపల్ ఆఫీసులో మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకన్న మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ తీవ్రమైన నేరమని, ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలు అక్రమ రవాణా బారినపడి దుర్భర జీవితాన్ని గడుపాల్సి వస్తుందన్నారు. మానవ అక్రమ రవాణా జరుగకుండా అంగన్‌వాడీలు ప్రజల్లో అవగాహనను పెంచాలని కోరారు. షాద్‌నగర్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ సినిమా అవకాశం, ప్రేమ, ఉద్యోగం పేరుతో గుర్తుతెలియని వారు చెప్పే మాటలు నమ్మి జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు. మాయమాటలు చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలరామకృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం తమ సంస్థ గత 28 ఏళ్ల నుంచి పోరాటం చేస్తూ, వేలాది మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించినట్లు తెలిపారు.

ప్రదక్షణల విషయంలో అయోమయానికి గురికావద్దు


మాట్లాడుతున్న అర్చకుడు సీఎస్ రంగరాజన్

మొయినాబాద్, ఆగస్టు 7: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన కలియుగ దైవం శ్రీ చిలుకూరు బాలాజీ వేంకటేశ్వ దేవాలయంలో లోపల భక్తులు నిర్వహించే ప్రదక్షణల విషయంలో భక్తులు ఎలాంటి అయోమయానికి గురికావాల్సిన అవవసరం లేదని ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయం లోపల భక్తులు ప్రదక్షణలు చేసుకునేందుకు అనుమతి లేదని.. ఆ మూడు రోజుల్లో ఆలయం వెలుపల నుంచి మహా ప్రదక్షణలు చేసుకోవచ్చని చెప్పారు. లోపల 11 ప్రదక్షిణలు చేసేవారు బయట ఒక్కటి, 108 చేసే వారు బయట 11 ప్రదక్షణలు చేస్తే స్వామివారి అనుగ్రహం అభిస్తుందన్నారు. మిగతా రోజుల్లో యథావిధిగా ఆలయంలో లోపల ప్రదక్షణలకు అనుమతిస్తామని చెప్పారు. ఆలయం వెనుకాల గల గోశాలలో ప్రతీ శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, దాతలు కూడా ముందుకు రావొచ్చని చెప్పారు.

కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించండి


హైదరాబాద్‌లోని డిప్యుటీ చీఫ్ లేబర్ కమిషనర్‌తో చర్చించి వస్తున్న సీసీఐ కార్మిక నాయకులు

తాండూరు రూరల్, ఆగస్టు 7: కరన్‌కోట్‌లోని కేంద్ర ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించాలని హైదరాబాద్‌లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్(సెంట్రల్) రాఘవేంద్రనాయక్.. సీసీఐ యాజమాన్యాన్ని ఆదేశించారు. బుధవారం కరన్‌కోట్ శివారులోని సీసీఐ ఫ్యాక్టరీ కార్మికులు, సంఘాల నాయకులు, యాజమాన్యం తరఫున హెచ్‌ఆర్ డిప్యుటీ మేనేజర్ పాల్, కాంట్రాక్ట్ కార్మికులు శరణప్ప, మహదేవ్, రాథోడ్, రమేష్, నబీ, రాములు, శంకర్, సీఐటీయూ నాయకులు లేబర్ కమిషనర్‌తో మాట్లాడారు. 2012లో అప్పటి ఆర్ఎల్‌సీ రీజినల్ లేబర్ కమిషనర్ ఎం.ధర్మరాజు ఆధ్వర్యంలో 1972చట్టం ప్రకారం సీసీఐ కాంట్రాక్ట్ కార్మికులకు, రిటైరైన వారికి, విధుల్లో ఉండి మృతి చెందిన వారికి గ్రాడ్యుటీ అందించేందుకు సీసీఐ యాజమాన్యంతో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం 8 మందికే ఇచ్చి మరో 60-70 మందికి ఇవ్వలేదు. ఏళ్లుగా యాజమాన్యాన్ని ప్రశ్నించినా స్పందించకపోవడంతో కార్మికులు అసిస్టెంట్‌లేబర్ కమిషనర్‌ను సంప్రదించారు. ఏఎల్‌సీ రాఘవేందర్‌నాయక్ స్పందిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసిన రికార్డులకు సంబంధించి ఎస్-ఫారంను తనకు ఇవ్వాలని, ఆ వివరాలన్నీ పరిశీలించి వడ్డీతో సహా గ్రాడ్యుటీ ఇప్పిస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్మికులు దీనికి ఒప్పుకున్నారు.

మూడో రోజు స్వచ్ఛదనం-పచ్చదనం


అన్నోజిగూడలో నాలాను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు7: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. బుధవారం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల వార్డుల్లో రోడ్లపై గుంతలను డస్టు, బీటీతో పూడ్చారు. వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. అన్నోజిగూడ బంధంకుంట నుంచి వచ్చే మురుగునీటి నాళాను శుభ్రం చేయించారు. నాళాలో, వీధుల్లో చెత్త వేయొద్దని ప్రజలను కార్యక్రమాలలో చైర్ పర్సన్లు ముల్లి పావనిజంగయ్యయాదవ్, బి.కొండల్‌రెడ్డి, కమిషనర్లు సాబేర్‌అలీ, వేమనరెడ్డి. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య సూచించారు. కాచవానిసింగారం, కొర్రెముల గ్రామాల్లో పర్యటించారు. అనంతరం అంగన్‌వాడీ, పాఠశాలలో వసతులను పరిశీలించారు. ఎంపీడీవో గీతారెడ్డి, కార్యదర్శులు సునీత, మల్లారెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ పరిశీలించారు. బొంరాస్‌పేట్ మండలం టేకులగడ్డతండా పాఠశాలను సందర్శించారు. రోడ్లను శుభ్రపర్చడం, గుంతలను పూడ్చడం, తాగునీటి సరఫరా ట్యాంకులను శుభ్రపర్చడం వంటి పనులను చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, హెచ్‌ఎం గోపాల్, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు మున్సిపాలిటీలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను శుభ్రం చేశారు. సీపీఐ కాలనీలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పరిసరాలను, మురుగు కాల్వల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు.కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, సూపర్‌వైజింగ్ ఆఫీసర్ ఎ.కపిల్‌కుమార్, సహాయ సిబ్బంది కె.వేణుగోపాల్ వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లోని రోడ్ల గుంతల్లో డస్ట్‌ను పోయించి మమ అనిపించారు. వార్డు ఆఫీసర్లు నర్మద, యాదగిరి, మదన్, సంగమేశ్వర్, ఉమేష్‌కుమార్, కె.నాగరాజు, నాగేందర్ పాల్గొన్నారు.


తాండూరులో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న మునిసిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి

మేడ్చల్ టౌన్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి పట్టణంలోని ఐటీఐలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మొక్కల నాటడంతో పాటు పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాలను చేపట్టారు. కాలనీల్లో నిలువ ఉన్న మురుగు నీటిని తొలగించి, డ్రెయిన్లలో పేరుకున్న పూడికను తొలగించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీల్లో నిర్వహించిన కార్యక్రమాలను సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ జాన్ శామ్సన్ పాల్గొని పర్యవేక్షించారు.


మేడ్చల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మర్రి దీపిక, కౌన్సిలర్లు

వైభవంగా స్వామి వారికి అశ్వవాహన సేవ


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: ఎదులాబాద్‌లోని గోదా సమేత మన్నారు రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఆండాళ్(గోదాదేవి) పుట్టిన రోజు సందర్భంగా తిరునక్షత్రం అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు, భారీగా గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, ఆగస్టు 7: తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లి పరిధి శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికిందరాబాద్‌కు చెందిన డాక్టర్ విక్రమ్‌రెడ్డి, సంగీతరెడ్డి దంపతులు అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌బాద్ జిల్లా కురవి మండలం చంద్‌తండాకు చెందిన మాలవోత్ వాసు(32) బోడుప్పల్ డీసీఎం డ్రైవింగ్ చేస్తుండేవాడు. వాసు ఆర్థిక ఇబ్బందులతో గత 27న యంనంపేట్ చౌరస్తా సమీపంలోని వంతెన వద్ద యాసిడ్ తాగాడు. పోలీసులు అతడిని నిమ్స్ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వాసు మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, ఆగస్టు 7: ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలియాబాద్‌కు చెందిన మహేష్(38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొన్ని రోజుల క్రితం అతడి భార్య మరణించింది. ఈ విషయంలో మహేష్‌పై కేసు నమోదైంది. కోర్టుకు హాజరుకావల్సి ఉంది. దీంతో మనస్తాపానికి గురై మోట బావి వద్ద(బండ రాయి)కి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలేజీకెళ్లిన విద్యార్థి అదృశ్యం


వినయ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథనికి చెందిన దామర సమ్మయ్య కుమారుడు వినయ్(16) ఎదులాబాద్‌లోని టీజీడబ్ల్యుఆర్ కళాశాలలో ఎంఎల్‌టీ మొదటి సంవత్సరంలో జూన్ 27న చేరాడు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో ఈ నెల 6న ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. దీంతో ప్రిన్సిపల్ వేణుగోపాల్ తల్లిదండ్రులకు తెలియజేశాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ వినయ్ చెప్పకుండా ఇంటికి వెళ్లాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కీసర రూరల్, ఆగస్టు 7: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు బంగారు ఆభరణాలు, కిరాణ దుకాణం నుంచి నగదు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం కీసర పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీర్యాల్‌లోని ఎస్‌ఎల్‌ఎన్ కాలనీలో ప్రసాద్‌రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం పనినిమిత్తం కుటుంబీకులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని స్వగ్రామానికి వెళ్లారు. బుధవారం వచ్చి చూసేసరికి దొగతనం జరిగినట్టు గుర్తించారు. ఇంట్లో 2తులాల బంగారు నగలు, పక్కనే ఉన్న కిరాణ షాపు నుంచి రూ.11వేల దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పొలాల వద్ద బోరు వైర్ల అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: వ్యవసాయబావి వద్ద 300 మీటర్ల రాగి తీగ అపహరించారు. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బొక్కోనిగూడకు చెందిన బొక్క శ్రీనివాస్‌రెడ్డి పొలం వద్ద మంగళవారం రాత్రి బోరుమోటార్‌కు ఉన్న రాగి తీగను దుండగులు ఎత్తుకెళ్లారు. అలాగే పక్కన ఉన్న జంగారెడ్డి, మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డిల వ్యవసాయక్షేత్రాల వద్ద సైతం బోర్ మోటార్ల రాగితీగలను ఎత్తుకపోయారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సెంట్రింగ్ డబ్బాలు..

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: సెంట్రింగ్ డబ్బాలు చోరీకి గురైన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన దొడ్డి కృష్ణకు చెందిన సెంట్రింగ్ డబ్బాలను బీరప్ప గుడి సమీపంలోని ఓ భవనం వద్ద అమర్చారు. మంగళవారం రాత్రి దొంగలు టాటాఏస్ వాహనంలో వచ్చి సెంట్రింగ్ డబ్బాలను లోడ్ చేశారు. శబ్దం విని వాచ్‌మెన్ లేచి స్థానికులతో కలిసి వారిని వెంబడించారు. అప్పటికే 169 సెంట్రింగ్ డబ్బాలను ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: చోరీ కేసులో నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. క్రైం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పరిధి బాలాజీనగర్‌లో అక్రం ఇంట్లో గత 31న చోరీ జరిగింది. వెండి పట్టగొలుసులు, కడియాలు మొత్తం 30 తులాల వెండి అభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట బైపాస్ సర్వీసు రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపల్లికి చెందిన తెనుగు మహేందర్(22) 31న అక్రం ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. వెండి అభరణాలను రికవరీ చేసుకొని నిందితుడి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న 17 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 7: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మేడ్చల్ పోలీసులు పట్టుకొని 17టన్నుల బియ్యాన్ని స్వాధీనంచేసుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ నుంచి 17 టన్నులు బియ్యంలో మహారాష్ట్రాకు వెళ్తున్న లారీ(కేఏ33 8077)ని బుధవారం కండ్లకోయ రింగ్‌రోడ్డు సమీపంలో పట్టుకున్నామన్నారు. లారీ డ్రైవర్ రాజశేఖర్(42)ను విచారించగా రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు చెప్పాడని తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న లారీని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు.

అంపల్లి చౌరస్తా వద్ద ఐదు క్వింటాళ్లు..

ధారూరు: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అంపల్లి చౌరస్తా వద్ద ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, సిబ్బంది వాహనాల తనిఖీలు చేశారు. నాగారం నుంచి వస్తున్న ఆటో(టీఎస్34టీఏ 8196)ను తనిఖీ చేయగా 5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఆటో తాండూర్‌కు చెందిన నాసర్‌మియాగా తేలిందని, బియ్యం, ఆటోను తహసీల్దార్‌కు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

రికవరీ చేసిన ఫోన్లు యజమానులకు అందజేత

ధారూరు, ఆగస్టు7: పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామని ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ బుధవారం తెలిపారు. గట్టేపల్లికి చెందిన రాజేందర్‌రావు, చింతకుంటకు చెందిన పి.శ్రీనివాస్‌రెడ్డిల ఫోన్లు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ రెండు ఫోన్లను సీఇఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి స్వాధీనం చేసుకుని అందజేశామని తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధి


టెంకాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్

తాండూరు, ఆగస్టు 7: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాడూరు పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ అన్నారు. బుధవారం 6వ వార్డులో అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించామని తెలిపారు. రెండు నెలల పాటు పట్టణంలో ముమ్మరంగా అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ రూపు రేఖలు మారుస్తామని ఆమె చెప్పారు. స్ట్రీట్‌లైట్ల సమస్య కూడా త్వరలోనే పరిష్కరమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, రవిరాజు, కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హెసెన్, మహిళలు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సత్కారం

కులకచర్ల, ఆగస్టు 7: కేరళలోని వయనాడు వరదల్లో చిక్కుకున్న ప్రజలకు సేవలందించిన ఆర్మీ జవాన్ రాజ్‌కుమార్‌ను బుధవారం కులకచర్లలో సన్మానించారు. భారీ వర్షాలకు మూడు గ్రామాలకు వెళ్లే దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఆర్మీ జవాన్‌లు 16గంటల్లో 190అడుగుల పొడవైన వంతెన నిర్మించారు. అందులో కులకచర్లకు చెందిన ఆర్మీ రాజ్‌కుమార్ కూడా ఉన్నారు. ఆయన స్వగ్రామానికి రాగా రాజ్‌కుమార్ లాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలంటూ ప్యాక్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, బీజేపీ నాయకులు చంద్రలింగం, మాజీ సర్పంచ్ రవిలాల్, వినోద్‌కుమార్, భీమయ్య పాల్గొన్నారు.


జవాన్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్థానికులు

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి


వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

వికారాబాద్/కొడంగల్ రూరల్ / పరిగి, ఆగస్టు 7 : జనగాం బార్ అసోసియేషన్ న్యాయవాది అమృత్‌రావు, ఆయన సతీమణి కవితరావుపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం న్యాయవాదులు వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. దాడి చేసిన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, రఫి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. న్యాయవాద దంపతులపై పోలీసులు దాడి చేయడం నేరం అని, వారిపై చర్యలు తీసుకోవాలని కొడంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో లాయర్లు వెంకటయ్య, భాగ్యలత, వెంకట్‌రెడ్డి, ఏపీ.ఆనంద్, పి.సుధాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బస్వరాజ్, మురళీనామాజీ, వెంకటయ్య, శకనప్ప, రాములు, కృష్ణయ్య, రమేశ్, భానుప్రసాద్, రవీందర్‌నాయక్, మోహిద్ తదితరులు పాల్గొన్నారు. పరిగి బార్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, భక్తకుమార్‌ల ఆధ్వర్యంలో లాయర్లు విధులను బహిష్కరించారు. పోలీస్‌స్టేషన్‌లో అడ్వకేట్లపై అకారణ దాడి హేయం అని అన్నారు. బాధ్యులైన సీఐ, ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింగం, నరేందర్‌యాదవ్, ఆనంద్‌గౌడ్, బాల ముకుందం, వెంకట్రాములు, జయలక్ష్మి, అలీ ముద్దీన్, రాజేందర్‌గౌడ్, నర్సింహారావు, కైసర్‌పాషా, నజీర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానాలు


అంతారం తండాలో నర్సింహులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్, టీచర్లు

తాండూరు రూరల్, ఆగస్టు 7: అంతారం తండా పాఠశాలలో ఆరేళ్లు పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఎం.నర్సింహులును తండా వాసులు బుధవారం సన్మానించారు. హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రాంచందర్‌నాయక్, తండావాసులు సన్మానించారు. నర్సింహులు ఆరేళ్లపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించారన్నారు. పంచాయతీ కార్యదర్శి అంబిక, స్థానికులు రామునాయక్, శంకర్‌నాయక్, హన్మంతు, మాణిక్‌బాయ్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: బదిలీపై వెళ్లిన చెర్లతండా పాఠశాల టీచర్ వాసూరాంను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. వాసురామ్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పాఠశాలలో తాను సేవలందించానని తెలిపారు. తాను విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు. హెచ్‌ఎం లల్యానాయక్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ఎక్కడికి వెళ్లినా చేసిన సేవలే గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భీమయ్య, వెంకట్‌రెడ్డి, సతీశ్, టీచర్లు బాల్‌రాజ్, రఘువీర్, రాకేశ్, సీఆర్‌పీ రెడ్యానాయక్, అంగన్‌వాడీ టీచర్ కమల పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, ఒక్కడికి కొత్తగా వచ్చిన టీచర్లను గ్రామస్తులు సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానికులు అనంతయ్య, పెంటయ్య, ఆనంద్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల విలీనంపై పీసీసీ ఉపాధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


వజ్రేష్‌యాదవ్‌ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

మూడుచింతలపల్లి, ఆగస్టు 7: కాంగ్రెస్ మండల మండల అధ్యక్షుడు నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథంల ఆధ్వర్యంలో మండల నాయకులు బుధవారం పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. వారు ఆయనతో మాట్లాడుతూ మండలంలోని గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలన్నారు. మండల గ్రామాలు హైదరాబాద్, సైబరాబాద్‌లకు దగ్గరలో ఉన్నాయని, కానీ సిద్దిపేట్, నల్గొండ, మెదక్ జిల్లాలో కలిపితే ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. ఈ పుకార్లపై గ్రామాల్లో మాట్లాడుకుంటున్నారన్నారు. వజ్రేష్.. స్పందిస్తూ ముఖ్యమంత్రి విదేశీ పర్యటన నుంచి రాగానే ఆయనతో మాట్లాడతానన్నారు. ప్రభుత్వం గ్రామాలను మున్సిపాలిటీల్లో కలపనుందా? లేక పంచాయతీలాగానే కొనసాగిస్తుందా? అనేది స్పష్టతిచ్చే వరకు పుకార్లను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, రాజేంద్రపసాద్, వెంకటరమణరెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, వేణుగోపాల్, బస్వారెడ్డి, నర్సింహులు మాజీ ఎంపీటీసీ అఖిలేష్‌రెడ్డి పాల్గొన్నరు.

బషీరాబాద్ సీహెచ్‌సీకి అయోడిన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, ఆగస్టు 7 : 'ఇదేం ఆసుపత్రి? గాయంతో వస్తే అయోడిన్ లేదా?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్తకు జిల్లా వైద్యాధికారులు స్పందించారు. అయోడిన్ లేదని ఎందుకు గుర్తించలేదని సిబ్బందిని మందలించినట్లు సమాచారం. స్టాక్ వచ్చే వరకు వేరే ఆసుపత్రి నుంచి సీహెచ్‌సీకి అయోడిన్‌ను పంపారు. ఇకపై అయోడిన్ కొరత రానివ్వకుండా చూస్తామని సిబ్బంది అన్నారు.

దుకాణాల టెండర్ నిర్వహించాలి

పరిగి, ఆగస్టు 7: పరిగి మునిసిపాలిటీలో గల 27దుకాణాలకు వెంటనే టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని సీపీఎం నాయకులు బుధవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో లింగ్యానాయక్‌ను కలిశారు. 27దుకాణాలకు ఏప్రిల్ 30నే టెండర్ ముగిసిందన్నారు. మూడు నెలలైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొందరు ప్రజాప్రతినిధులు టెండర్ జరగకుండా దుకాణాదారులతో లాబీయింగ్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు టెండర్ నిర్వహించి దుకాణాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు చంద్రయ్య ఉన్నారు.


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, ఆగస్టు 7: మున్సిపాలిటీలో రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం పలు కాలనీలను అనుసంధానం చేస్తూ ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు మున్సిపల్ నిధులు రూ.26లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు చైర్మన్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు హరిబాబు, సుమిత్ర, శ్రీనివాస్, సుర్వి శ్రీనివాస్, డీఈఈ సుదర్శనం రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే చర్యలు

మర్పల్లి, ఆగస్టు 7: ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే సహించేది లేదని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళ, బుధవారాల్లో ఎంపీడీవో కార్యాలయంలో 27 పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేసిన రూ.9.99కోట్ల విలువైన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. లెక్కల్లో తేడాలు వచ్చిన మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది నుంచి రూ.1.11లక్షలు రికవరీ చేశారు. అలాగే రూ.2.3లక్షల జరిమానా విధించారు. విధులు సక్రమంగా నిర్వహించని బూచన్‌పల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, ఏపీయం అంజిల్‌రెడ్డి, ఉపాధి హామీ తనిఖీ బృందం తదితరులు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్

రైతులు పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి


దాదాపూర్‌లో పంట చేలను పరిశీలిస్తున్న డీఏవో గోపాల్

దోమ, ఆగస్టు 7: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తెలిపారు. బుధవారం బ్రాహ్మణపల్లి, దాదాపూర్ గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ప్రతీ రైతు పంట వివరాలను నమోదు చేసుకుంటే కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలకు సులువవుతుందన్నారు. ఆయన వెంట ఏఈవో చెన్నయ్య, రైతులు ఉన్నారు.

శ్రీ గోదాదేవి జన్మదినం సందర్భంగా పూజలు

కొడంగల్, ఆగస్టు 7: శ్రీ గోదాదేవి జన్మదినం సందర్భంగా బుధవారం కొడంగల్ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గోదాదేవి ఆస్థాన మండపంలో తిరుచ్చి వేంచేపు చేసి పూలమాలలతో అమ్మవారిని అలంకరించారు. ఆస్థాన మండపంలో అమ్మవారికి ఆలయం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ పురోహితులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కీసర సబ్ రిజిస్ట్రార్‌గా ఉమాదేవి

కీసర, ఆగస్టు 7: కీసర సబ్ రిజిస్ట్రార్‌గా ఉమాదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన సురేష్ బదిలీపై కూకట్‌పల్లికి వెళ్లాడు. రిజిస్ట్రార్ ప్రధాన కార్యాలయం నుంచి ఉమాదేవి బదిలీపై కీసర సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండ

కులకచర్ల, ఆగస్టు 7: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని సొసైటీ చైర్మన్ మొగులయ్య అన్నారు. బుధవారం చౌడాపూర్‌లో ఆయన హేర్ కటింగ్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, సొసైటీ వైస్‌చైర్మన్ నాగరాజు, సలీమ్, ఆనందం పాల్గొన్నారు.

భవిష్యత్తు ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్‌దే

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7: భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దేనని లీడ్ డేటా సైంటిస్ట్ నిరీక్షణ్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం టెక్ అమ్యూస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా...

● **ఘట్‌కేసర్ రూరల్:** ప్లాట్లు ఖాళీ చేయమని తాము ఎవరినీ బెదిరించలేదని ఎదులాబాద్‌కు చెందిన కటికం రాము, లక్ష్మన్‌లు బుధవారం తెలిపారు. ఎదులాబాద్‌లోని సర్వే నంబర్ 10 పెరడులో ప్లాట్లు విక్రయించి తిరిగి లాక్కునేందుకు యత్నిస్తున్నామంటూ ప్లాట్ల యజమానులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల్లో వాస్తవం లేదన్నారు. గతంలోనే తాము కోర్టును ఆశ్రయించామని, కోర్టు కూడా తీర్పు తమకే అనుకూలంగా వచ్చిందన్నారు. అయినా తాము ఎవరినీ ప్లాట్లు ఖాళీ చేయించలేదని చెప్పారు. తమ తండ్రి గతంలో విక్రయించిన ప్లాట్లకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

● **బషీరాబాద్:** మైల్వార్ పంచాయతీలో ఉప్పరి రాములమ్మ అనే వృద్ధురాలు మృతిచెందింది. మాజీ సర్పంచ్ సీమాసుల్తాన, మాజీ వైస్‌ఎంపీపీ ఖాలేద్ మృతురాలి అంత్యక్రియలకు రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, ఇబ్రహీం, రాములు, ఉమేష్, వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: యువత స్వయంకృషితో ఉపాధి పొందడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. బండవెల్కిచర్లలో ఇంటర్‌నెట్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శులు నర్సింహారెడ్డి, గూడాల వెంకటేశ్, ఆంజనేయులు, రాములు, నూరోద్దీన్, హైమద్, నర్సిములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మండల స్పెషలాఫీసర్ సైదులు పిలుపునిచ్చారు. తుర్కపల్లిలో ఎంపీడీఓ మమతబాయితో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, వెటర్నరి డాక్టర్, ఇరిగేషన్ ఏఈ, ఏపీఎం, ఆర్‌ఐ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడి టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మంతన్‌గౌడ్‌లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ విద్యార్థులతో ర్యాలీ తీశారు. వార్డుల్లో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి నీటి బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. డ్రైనేజీ నీరు నిలిచే ప్రాంతంలో సామాజిక ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలరంగాచారి పాల్గొన్నారు.

● **దోమ:** మోత్కూర్‌లో శానిటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హెచ్.మహేశ్ బాబు, ఎంపీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: కేరళలోని వయనాడ్ ప్రాంతంలో వరదలతో ప్రజాజీవనం అస్తవ్యస్తమైందని, బాధితులకు అపన్నహస్తం అందించేందుకు ప్రతొక్కరు సహకరించాలని ఘట్‌కేసర్ మండల సీపీఎం కార్యదర్శి సబిత అన్నారు. పోచారంలో విరాళాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగి పడి వందల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇళ్లు నేలమట్టం అయ్యాయన్నారు. బాధితులను ఆదుకునేందుకు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాగమణి, సునీత, మీనా, పార్వతమ్మ, రేణుక, అనురాధ తదితరలులు పాల్గొన్నారు.

● **కొడంగల్ రూరల్:** పుట్టిన శిశువుకు తల్లిపాలు శ్రేష్ఠమని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో కొడంగల్ మండలంలోని రుద్రారంలో నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అపోహలు, ఆధునిక పోకడలతో కొందరు తల్లులు బిడ్డలకు ఇవ్వరని, ఇది సరి కాదన్నారు. శిశువుల్లో రోగ నిరోధక లోపించి మరణాలు పెరుగుతున్నాయన్నారు. తల్లిపాల ప్రాముఖ్యం, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాల గురించి గర్భిణి మహిళలు, బాలింతలకు అవగాహన కల్పించారు.

● **ఘట్‌కేసర్:** శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలనే పట్టించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. అంగన్‌వాడికేంద్రం-2లో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తల్లిపాలతో శిశువులు అన్ని రకాల వ్యాధులను తట్టుకుంటారని చెప్పారు. బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలన్నారు. కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.